ఎన్టీఆర్

'వార్-2'కంటే ముందుగానే..?

బాలీవుడ్‌లో యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ చిత్రాలకు ఎంతో క్రేజ్ ఉంది. 'ఏక్ థా టైగర్' నుంచి 'పఠాన్' వరకు ఈ జోనర్ సినిమాలన్నీ భారీ విజయాలు సాధించాయి. దీంతో సల్మాన్‌ఖాన్ నటిస్తున్న 'టైగర్-3' చిత్రంపై భారీ అంచనాలేర్పడ్డాయి. ఇందులో షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో నటించడం స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. దీపావళికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ సినిమా నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వినిపిస్తున్నది. టాలీవుడ్ అగ్ర హీరో ఎన్టీఆర్ 'టైగర్-3'లో అతిథి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. క్లైమాక్స్ ఘట్టాల్లో 'రా' ఏజెంట్‌గా ఆయన ఇంట్రడక్షన్ ఉంటుందని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించనున్న 'వార్-2' చిత్రం ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఆయన హృతిక్‌రోషన్‌తో తెరను పంచుకోబోతున్నారు. అయితే ఈ సినిమా కంటే ముందుగానే ఎన్టీఆర్‌ను 'టైగర్-3' చిత్రం ద్వారా బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం చేయాలన్నది నిర్మాత ఆదిత్యచోప్రా ఆలోచనగా చెబుతున్నారు. 'టైగర్-3'లో పరిచయం చేసే ఎన్టీఆర్ పాత్ర మరలా 'వార్-2' ఎంట్రీ ఇస్తుందని చెబుతున్నారు. అయితే ఈ విషయంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'వార్-2' నవంబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

35కోట్ల పారితోషికం వాపస్

బాలీవుడ్ అగ్ర హీరో రణబీర్‌కపూర్ తాజా చిత్రం 'యానిమల్' టీజర్ ఇటీవలే విడుదలైంది. తండ్రీకొడుకుల సంఘర్షణ, గ్యాంగ్‌స్టర్ నేపథ్య అంశాలతో టీజర్ ఆసాంతం ఆసక్తిని పంచింది.'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా మరింత క్వాలిటీగా రావడానికి హీరో రణబీర్‌కపూర్ తన పారితోషికంలో 35కోట్లను వాపస్ చేశారని ముంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ముందుగా అనుకున్న ప్రకారం ఈ సినిమా ఆగస్ట్‌లో విడుదల కావాల్సి ఉంది. పాన్ ఇండియా చిత్రం కావడం వల్ల..క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీపడొద్దనే ఉద్దేశ్యంతో విడుదల వాయిదా వేస్తున్నట్లు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా పేర్కొన్న విషయం తెలిసిందే. సినిమా బెస్ట్ క్వాలిటీతో బయటకు రావాలనే రణబీర్‌కపూర్ తన పారితోషింలో సగ భాగాన్ని తిరిగి ఇచ్చేశాడని అంటున్నారు. అయితే సినిమా విడుదల అనంతరం లాభాల్లో వాటా ఇచ్చే ఒప్పందంతో రణబీర్‌కపూర్ రెమ్యునరేషన్‌ను రిటర్న్ చేశారని అంటున్నారు. ఏది ఏమైనా సినిమా క్వాలిటీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రణబీర్‌కపూర్ తన మంచి మనసును చాటుకున్నారని ముంబయి సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

ఈషా రెబ్బా

వాస్తవాన్ని చూపించాం

నవీన్‌చంద్ర, స్వాతిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకుడు. అక్టోబర్ 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిత్ర నిర్మాత యశ్వంత్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఒక లైఫ్ డ్రామా. ప్రతీ ఒక్కరి జీవితంలో హనీ మూన్ పీరియడ్ ఉంటుంది. అది చాలా అందంగా అనిపిస్తుంది. అయితే అది అలాగే లైఫ్‌లాంగ్ ఉండాలని లేదు. ప్రయాణంలో ఎత్తుపల్లాలు సహజం. ఈ వాస్తవాన్ని మా సినిమాలో చూపించాం. నిర్మాతగా మంచి కంటెంట్ ఉన్న సినిమాలు అందిచాలన్నది నా లక్ష్యం. ఈ వారం సినిమాలు ఎక్కువగా ఉన్నా థియేటర్స్ సమస్య రాలేదు. మన ఆడియన్స్ ఎవరూ అనేది ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం' అన్నారు.

ఈ ఏడాది నాపై పురస్కారాల వర్షం కురిసింది

మురళీమోహన్, శ్రీలేఖ, చంద్రబోస్, సుచిత్ర, ప్రదీప్

'' మామూలుగా హీరోలకోసం జనం వస్తారు. ఈ వేడుకకు మాత్రం అక్షరం కోసం జనం వచ్చారు. ఇది అద్భుతమైన వేదిక. ఈ సందర్భంగా నాకు తొలి అవకాశం ఇచ్చిన దర్శకుడు ముప్పలనేని శివగారికి, సంగీత దర్శకురాలు శ్రీలేఖకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను'' అన్నారు చంద్రబోస్. అస్కార్ విజేత, జాతీయ పురస్కార గ్రహీత, గేయరచయిత చంద్రబోస్ అభినందన సభ శనివారం హైదరాబాద్‌లో నటుడు ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సుచిత్ర చంద్రబోస్ జ్యోతి ప్రకాశనం చేశారు. చంద్రబోస్ ఇంకా మాట్లాడుతూ -'' 860 సినిమాల్లో 3600పాటలు రాశాను. 2023 కవిగా నాకు పరిపూర్ణతనిచ్చిన సంవత్సరం. ఈ ఏడాది నాపై పురస్కారాల వర్షం కురిసింది. ఒకే ఏడాది ఆరు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నాను. 'నాటు నాటు' పాట ద్వారా తెలుగు భాష గొప్పతనం ప్రపంచానికి తెలిసింది. నాటు నాటు పాటను మొదట 45 నిమిషాల్లో రాశాను. ఆ తర్వాత మార్పులు చేయాల్సొచ్చింది. 45 రోజులు కష్టపడి రాశాను. అంత కష్టానికి దేవుడు ఇవ్వాల్సిందే ఇచ్చాడు' అన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ- ''తెలుగు సినిమాకు ఆస్కార్ తెచ్చిన మహనీయుడు చంద్రబోస్. ఒకే ఏడాది ఆస్కార్, నేషనల్ అవార్డులు అందుకున్న ఏకైక పాటల రచయిత చంద్రబోస్ మాత్రమే. సి.నారాయణరెడ్డి, దాశరథి, గద్దర్, చంద్రబోస్, సుద్దాల అశోక్‌తేజ వీరంతా తెలంగాణ కవులు. వీరిలో నారాయణరెడ్డిగారు జ్ఞానపీఠ్ తెస్తే.. సుద్దాల అశోక్ తేజ జాతీయ అవార్డు తెచ్చారు. ఇక మన చంద్రబోస్ ఆస్కార్‌తోపాటు జాతీయ పురస్కారం కూడా తెచ్చారు. ఇది తెలుగువారంతా గర్వపడాల్సిన విషయం. 3600 పాటలు రాశారాయన. పదివేల పాటలు పూర్తిచేస్తారు. అప్పుడు ఇంకా పెద్ద వేడుక చేయాలి'' అని మురళీమోహన్ అన్నారు. ఇంకా రామజోగయ్యశాస్త్రి, ముప్పలనేని శివ, ప్రదీప్ నాగరాజు తాళ్లూరి, జేడీ, రాజేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైరల్ విశాలాక్షిగా మెప్పిస్తా!

'నటిగా పదేళ్ల ప్రయాణం పూర్తిచేసుకున్నా. తెలుగుతో పాటు తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా రాణిస్తున్నా. 'అరవింద సమేత వీర రాఘవ' మంచి పేరు తీసుకొచ్చింది. ఇటీవల చేసిన 'దయా' సిరీస్‌లో నా పాత్రకు మంచి గుర్తింపు దక్కింది' అని చెప్పింది కథానాయిక ఈషా రెబ్బా. ఈ భామ సుధీర్‌బాబు సరసన నటిస్తున్న తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ దర్శకుడు. అక్టోబర్ 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను విశాలాక్షి అనే చలాకీ అమ్మాయి పాత్రలో కనిపిస్తా. తను టిక్‌టాక్ వీడియోలు చేస్తుంటుంది. ప్రతీ వీడియో వైరల్ అయిపోవాలని తపిస్తుంటుంది. ఈ క్రమంలో చక్కటి వినోదాన్ని పండిస్తుంది. నా పాత్ర హుషారుగా సాగుతుంది. ఈ సినిమాలో ప్రతీ పాత్రకు ఓ బ్యాక్‌స్టోరీ ఉంటుంది. కామెడీ, ఎమోషన్స్‌తో ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంటుంది. సుధీర్‌బాబు త్రిపాత్రాభినయంలో కనిపిస్తారు. మూడు గెటప్స్ వైవిధ్యంగా ఉంటాయి. నా కెరీర్ పట్ల హ్యాపీగా ఉన్నా. సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలో ఆఫర్లొస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో విక్రమ్‌ప్రభుతో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నా. తెలుగులో అంగీకరించిన ఓ చిత్రం త్వరలో ప్రారంభమవుతుంది' అని చెప్పింది.

'జవాన్' సరికొత్త రికార్డు

షారుఖ్‌ఖాన్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కిన 'జవాన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల ప్రభంజనాన్ని సృష్టిస్తున్నది. విడుదలై ఇంకా నెల రోజులు కాకముందే ఈ చిత్రం ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 1043 కోట్ల వసూళ్లను సాధించింది. హిందీలో 584 కోట్లు సాధించి రికార్డు సృష్టించింది. హిందీలో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. రెండు రోజుల వరకు 'గదర్-2' పేరిట వున్న ఈ రికార్డును 'జవాన్' అధిగమించింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. షారుఖ్‌ఖాన్ స్వీయ నిర్మాణ సంస్థ రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఆర్మీ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు విశేషంగా ఆకట్టుకుంటున్నది.

'కన్నప్ప'లో మోహన్‌లాల్

మంచు విష్ణు 'కన్నప్ప' సినిమా విశేషాల సమాహారంగా మారింది. ఇప్పటికే ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ఇందులో శివపార్వతులుగా ప్రభాస్, నయనతార నటిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ సినిమాలో చాలామంది స్టార్లు భాగమవ్వనున్నారని గతంలో విష్ణు చెప్పాడు. అందుకు తగ్గట్టుగా మరో స్టార్ ఈ సినిమాలో నటిస్తున్నారు. ఆ స్టార్ ఎవరో కాదు. మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్. ఇందులో మోహన్‌లాల్ ఓ ప్రత్యేకపాత్ర పోషించనున్నారు. మోహన్‌లాల్‌ని విష్ణు కలిసిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో 'కన్నప్ప'లో మోహన్‌లాల్ నటిస్తున్నారనే వార్త నిజమైంది. కాళహస్తి స్థలపురాణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ కనిపించనున్న పాత్ర ఏమై ఉంటుందనేది ఈ కథ తెలిసినవాళ్లకు ఓ ఫజిల్. మరి ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లోకి ఇంకెన్ని నక్షత్రాలొచ్చి చేరతాయో చూడాలి. ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.

గబ్బర్‌సింగ్‌కి నెక్ట్స్ లెవల్

పవన్‌కల్యాణ్, హరీశ్‌శంకర్ కలయికలో వచ్చిన 'గబ్బర్ సింగ్' ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. మళ్లీ వారిద్దరి కాంబినేషన్‌లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' పేరుతో సినిమా వస్తుండటంతో ఆ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ సినిమా గురించి దర్శకుడు హరీశ్‌శంకర్ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను పంచుకున్నారు. 'పవన్‌కల్యాణ్‌గారిపై సన్నివేశాల చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన భాగం షూటింగ్ పూర్తయింది. 'గబ్బర్‌సింగ్'కి నెట్స్ లెవల్‌లో ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ నటవిశ్వరూపం చూస్తారు. మరిన్ని అప్‌డేట్లు త్వరలో తెలియజేస్తాం' అని హరీశ్‌శంకర్ పేర్కొన్నారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలందిస్తున్నారు. వై.రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మాతలు.



సూర్యరేవతిపై క్లాప్‌నిస్తున్న మంత్రి పట్నం మహేందర్ రెడ్డి

'మేడమ్ చీఫ్ మినిస్టర్' ప్రారంభం

స్వీయ దర్శకత్వంలో డా॥ సూర్య రేవతి కథానాయికగా నటిస్తున్న 'మేడమ్ చీఫ్ మినిస్టర్' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మంత్రి పట్నం మహేందర్ రెడ్డి క్లాప్‌నిచ్చారు. చిత్ర దర్శకనిర్మాత, నటి డా॥ సూర్య రేవతి మాట్లాడుతూ 'అమెరికాలో కంపెనీ ప్రారంభించి సక్సెస్‌ఫుల్ నడిపిస్తున్నా. మన నేల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో ఇప్పటికే ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నా. ఈ సినిమా ద్వారా ప్రస్తుతం సమాజంలో ఉన్న పరిస్థితులను చూపించే ప్రయత్నం చేస్తున్నా' అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: వల్లెపు రవికుమార్, సంగీతం: కార్తీక్ బి కొడకండ్ల, మాటలు, స్క్రీన్‌ప్లే: సుహాస్ మీరా, కథ, నిర్మాత, దర్శకత్వం: సూర్య రేవతి మెట్టకూరు.

రష్మా థడానీ

రామ్‌చరణ్ జోడీగా అందాలతార కూతురు?

శంకర్ 'గేమ్‌ఛేంజర్'తో బిజీగా ఉన్న రామ్‌చరణ్, ఆ తర్వాత 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సన దర్శకత్వంలో సినిమా చేయనున్న విషయం తెలిసిందే. స్పోర్ట్స్ నేపథ్య కథాంశంతో తెరకెక్కనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో మొదలుకానుంది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగు చూసింది. ఇందులో కొత్తమ్మాయి రష్మా థడానీని కథానాయికగా తీసుకోనున్నారని సమాచారం. ఈ రష్మా థడానీ ఎవరో కాదు. అలనాటి అందాలతార రవీనాటాండన్ కుమార్తె. చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించకపోయినా సోషల్‌మీడియాలో మాత్రం ఈ వార్త బాగానే వైరల్ అవుతున్నది. దాదాపుగా రష్మా థడానీ కథానాయికగా ఖరారైనట్టు వినికిడి. ఈ చిత్రాన్ని మైత్రీమూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్న విషయం తెలిసిందే.